## క్లుప్తంగా

### వరద బాధితులను ఆదుకోవాలి: సీపీఎం



**ఇబ్రహీంపట్నం:** వరద బాధిత కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ డిమాండ్ చేశారు. కృష్ణానది వరద ప్రభావిత పొలాలు, కాలనీలను పార్టీ నాయకులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. వరద బాధితులకు తక్షణం ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయం అందించాలన్నారు. అవసరమైతే ముంపు ప్రాంతాల వారిని పునరావాస శిబిరాలకు తరలించాలని కోరారు. వరద ముంపునకు గురైన పంట పొలాల రైతులకు తక్షణం ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. రైతులతో మాట్లాడి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌సీహెచ్ శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి మహేష్, కమిటీ సభ్యులు విఠల్‌రావు, ఎస్‌కే బాష, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

### యాజమాన్య పద్ధతులు పాటించాలి



**చాట్రాయి:** వరి సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి బి.శివశంకర్ పేర్కొన్నారు. గురువారం చాట్రాయిలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధిక దిగుబడుల కోసం అధిక మోతాదులో రైతులు యూరియా వినియోగిస్తున్నారని, దీనివలన భూమిలో సూక్ష్మ జీవులు నశించి భూసారం తగ్గి చౌడుగా తయారవుతుందని చెప్పారు. యూరియాకు బదులుగా ఒక లీటరు నీటిలో 2.4 మిల్లీ లీటర్ల నానో యూరియా వాడాలని రైతులకు ఆయన సూచించారు.



ఇబ్రహీంపట్నం గాజులపేటలో వీధుల్లోకి, ఇళ్లల్లోకి చేరిన వరద నీరు



జూపూడిలో వరద నీటితో చెరువును తలపిస్తున్న వరి పొలాలు

# వాగుల ఉగ్రరూపం

- పలు గ్రామాలకు రాకపోకలు బంద్
- నీటిముంపులో పంట పొలాలు
- జలమయంగా పలు కాలనీలు

**ఇబ్రహీంపట్నం:** భారీ వర్షాలతో ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహం ప్రమాదకరంగా మారింది. పైభాగాన ఉన్న ప్రాజెక్టుల నుంచి కృష్ణానదికి వస్తున్న వరద ప్రవాహం ఒకవైపు, మరోవైపు మునేరు వరద ప్రవాహం, కొండవాగు, ఏనుగుగడ్డ, ఉబ్బడి వాగులు పొంగి ప్రవహించడంతో మండలంలోని లోతట్టు ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. కృష్ణానది వరద పోటుతో లంక గ్రామాలు, ఏనుగుగడ్డ వాగు ప్రవాహంతో దాములూరు, చిలుకూరు, ఆత్కూరు, కొత్తపేట గ్రామాలకు వాహనాల రాకపోకలు స్తంభించాయి. బైక్‌లు కూడా వెళ్లలేని పరిస్థితుల్లో ఆయా గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. రెండు రోజులుగా నీటిముంపులోనే పలు కాలనీలు, పంట పొలాలు ఉన్నాయి. జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, డీఎంహెచ్‌ఓ సుహాసిని, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ వరద ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

**పోటెత్తిన ఏనుగుగడ్డ వాగు**

కొండపల్లి రిజర్వ్ ఫారెస్ట్, వీరులపాడు మండలం వైపు నుంచి వచ్చే ఏనుగుగడ్డ వాగు వరద నీటితో ఉప్పొంగింది. వరద ప్రవాహంతో చిలుకూరు వద్ద ఆర్‌అండ్‌బీ రహదారిపై మోకాళ్ల ఎత్తున నీరు ప్రవహిస్తోంది. ఈ పరిణామాలతో దాములూరు, చిలుకూరు, కొత్తపేట, ఆత్కూరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఉబ్బడి వాగు సైతం ఉగ్రరూపం దాల్చడంతో మూలపాడు, కిలేశపురం గ్రామాల వద్ద చప్టాలపై నీరు ప్రవహిస్తోంది. పంట పొలాలకు వెళ్లేందుకు దారిలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పశుగ్రాసం కోసం పశువులను తోలుకెళ్లేందుకు అవకాశం లేక పాడి రైతులు అవస్థలు పడుతున్నారు.

**పంట పొలాల్లోకి నీరు**

ఓవైపు కృష్ణానది వరద, మరో వైపు ఏనుగు గడ్డవాగు ఉగ్రరూపం దాల్చడంతో పంట పొలాలు నీటి ముంపునకు గురయ్యాయి. ఒక్క చిలుకూరులో మొక్కజొన్న, పత్తి, వరి పైర్లు సుమారు 200 ఎకరాలకు పైగా వరద నీటి ముంపునకు గురయ్యాయి. జూపూడి, త్రిలోచనాపురం, మూలపాడు, ఇబ్రహీంపట్నం, కిలేశపురం గ్రామాల్లో సుమారు 150 ఎకరాలకు పైగా వరి చేలలో నీరు ప్రవేశించింది. రెండు రోజులుగా పత్తి మొక్కలు నీటిలో ఉండటంతో నేల ఉరకెత్తి మొక్కలు వడబడి పోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు

**నీటి ముంపులో పలు కాలనీలు**

భారీ వర్షాల ప్రభావంతో ఇబ్రహీంపట్నంలోని పలు కాలనీలు వరద నీటి ముంపులో చిక్కుకున్నాయి. గాజులుపేట, ప్రసాద్‌నగర్, ఆంజనేయనగర్, ఖాజీమాన్యం ప్రాంతాల్లో రోడ్లపైకి వరదనీరు చేరింది. పల్లంగా ఉన్న ఇళ్లల్లోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావు, తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు ధైర్యం చెప్పారు. అవసరమైతే సహాయక శిబిరాలకు తరలిస్తామన్నారు.



చిలుకూరులో ఏనుగుగడ్డ వాగు ఉప్పొంగడంతో రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు



ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్ వద్ద సహాయ శిబిరాలపై సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ సుహాసిని

### సహాయ శిబిరాల ఏర్పాటు

వరద పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని కొండపల్లి మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన ట్రక్ టెర్మినల్ వద్ద సహాయక శిబిరాలు ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో వరద బాధితులను తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. రెవెన్యూ, వైద్య, ఆరోగ్య శాఖల సిబ్బందిని నియమించారు. వరద ఉధృతి పెరిగితే చిన లంక, పెదలంక గ్రామాల ప్రజలతో పాటు గాజులపేట, పుష్కర నగర్, ఆంజనేయ నగర్ తదితర ప్రాంతాల ప్రజలను తరలించేందుకు సన్నాహాలు చేశారు. శిబిరాలను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, డీఎంహెచ్‌ఓ ఎం.సుహాసిని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

### ● మండల స్థాయి కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

**తిరువూరు:** తిరువూరు డివిజన్‌లో వాగులు, కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తిరువూరు ఆర్డీఓ కె. మాధురి పేర్కొన్నారు. డివిజన్‌లోని ఐదు మండలాల్లో కంట్రోల్ రూములను ఏర్పాటు చేశామని చెప్పారు. ఎ.కొండూరు మండల కేంద్రంలో తహసీల్దారు కె. లక్ష్మి, గంపలగూడెం మండలంలో సీనియర్ అసిస్టెంట్ ఎం. వీరభద్రరావు, తిరువూరులో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, రెడ్డిగూడెంలో డెప్యూటీ తహసీల్దారు సతీష్, విస్సన్నపేటలో డెప్యూటీ తహసీల్దారు సీహెచ్ హేమప్రసాద్ కంట్రోల్‌రూం ఇన్‌చార్జీలుగా అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎ.కొండూరు 99086 64627, గంపలగూడెం 79811 31013, తిరువూరు 80965 87174, రెడ్డిగూడెం 99668 49466, విస్సన్నపేట 73862 99264 నంబర్లను అత్యవసర సమయంలో సంప్రదించాలని కోరారు.















**సమాచార హక్కు చట్టంపై అవగాహన**

**లక్ష్మీపురం(తిరువూరురూరల్):** సమాచార హక్కు చట్టం ఆవశ్యకతను వివరిస్తూ మండలంలోని లక్ష్మీపురంలో గురువారం ప్రదర్శన నిర్వహించారు. లక్ష్మీపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో ప్లకార్డులు, ఫ్లెక్సీలతో సిబ్బంది ప్రదర్శన జరిపారు. సమాచార హక్కు చట్టం ప్రకారం ఏ ఏ సమాచారాన్ని తెలుసుకోవచ్చు, ఇందుకు దరఖాస్తు చేసే విధానంపై రైతులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పీఏసీఎస్ సీఈఓ బొల్లినేని రఘురాం పాల్గొన్నారు.

**మాజీ ఎమ్మెల్యేకి కేశినేని పరామర్శ**

**జి.కొండూరు:** మైలవరం మాజీ ఎమ్మెల్యే జ్యేష్ఠ రమేష్‌బాబు తల్లి విమలాదేవి (92) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందారు. విజయవాడ మాజీ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) గురువారం జి.కొండూరు మండల పరిధి కుంటముక్కల గ్రామంలోని జ్యేష్ఠ రమేష్‌బాబు నివాసానికి చేరుకొని విమలాదేవి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రమేష్‌బాబుని, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

**బుడమేరులో వరద ప్రవాహం**

**జి.కొండూరు:** మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి బుడమేరులో వరద ప్రవాహం కొనసాగుతోంది. వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద గురువారం సాయంత్రం ఆరు గంటల సమయానికి మూడు అడుగుల మేర నీటి నిల్వ ఉంది. రెడ్డిగూడెం వైపు నుంచి వచ్చే కోతులవాగు మినహా జి.కొండూరు మండల పరిధిలోని పులివాగు, మైలవరం మండల పరిధిలోని కొండవాగులలో వరద ప్రవాహం నిలిచిపోవడంతో బుడమేరులో వరద ప్రవాహం క్రమేపీ తగ్గుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. బుడమేరులో వచ్చే వరద ప్రవాహం డైవర్షన్ కెనాల్ ద్వారా కృష్ణానదిలోకి వెళ్తున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బంది లేదని ఇరిగేషన్ అధికారులు వివరించారు. జి.కొండూరు మండల పరిధిలోని హెచ్.ముత్యాలంపాడు, కందులపాడు గ్రామాల మధ్య బుడమేరుపై నూతనంగా నిర్మించిన చప్టాపై రాకపోకలను బుధవారం సాయంత్రం నుంచి నిలిపివేశారు. బుడమేరులో వరద ప్రవాహం పూర్తిగా తగ్గిన తర్వాత రాకపోకలను పునరుద్ధరిస్తారు.

## సంక్షిప్త వార్తలు

**శిఖర పునఃప్రతిష్ఠ మహోత్సవం**

**పుట్రేల(విస్సన్నపేట):** పుట్రేల గ్రామంలోని ఉమాదేవి సమేత ఆకేశ్వరస్వామి ఆలయం (శివాలయం)లో శివపరివార, ప్రమదగణ, శిఖర పునఃప్రతిష్ఠ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. భక్తులు పొంగళ్లు, నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ జరిగింది. తిరువూరు ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

**తెలంగాణ సెర్ప్ బృందం పర్యటన**

**ఆగిరిపల్లి:** మండలంలోని అడవి నెక్కలంలో గురువారం తెలంగాణ రాష్ట్ర సెర్ప్ (పేదరిక నిర్మూలన సంఘం) బృందం సభ్యులు పర్యటించారు. ఆంధ్రప్రదేశ్ సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డ్వాక్రా సంఘ సభ్యులకు ముందస్తు రుణ ప్రణాళిక ఏ విధంగా అమలవుతుందో పరిశీలించడానికి తెలంగాణ రాష్ట్ర సెర్ప్ బ్యాంకు లింకేజీ డైరెక్టర్ వైఎస్ రెడ్డి ఆధ్వర్యంలో అడవి నెక్కలంలోని స్వయం సహాయక సంఘ సభ్యులతో సమావేశమయ్యారు. సంఘ సభ్యులు వారి ఆర్థిక అవసరాల కోసం ప్రణాళిక ఎలా తయారు చేసుకుంటారు వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

**బయో గ్యాస్ ప్లాంట్ ఏర్పాటు వద్దు**

**ఆగిరిపల్లి:** తోటపల్లి గ్రామంలో బయో గ్యాస్ ప్లాంటును ఏర్పాటు చేయవద్దని, దీనివల్ల పర్యావరణం దెబ్బతింటుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు అన్నారు. మండలంలోని తోటపల్లి గ్రామంలో మంత్రి పార్థసారథి కుమారుడు నితిన్ కృష్ణ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి ప్రభుత్వం కేటాయించిన భూములను గురువారం సీపీఎం ఆధ్వర్యంలో పరిశీలించి ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతంలో పేదలు అనేక సంవత్సరాల నుంచి సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వకుండా పెట్టుబడిదారులకు కారు చౌకగా భూములు కట్టబెట్టే పని ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు.

**మైలవరంలో హర్ ఘర్ తిరంగా**

**మైలవరం:** మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు గురువారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు అధ్యాపకులతో కలిసి జాతీయ జండాలతో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీపురంశెట్టి రంగారావు, ఎన్‌సీసీ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**సుందరాకాండ సప్తాహం ప్రారంభం**

**తిరువూరు:** స్థానిక జగన్నాథపురం కాలనీలోని పాటిమీద దాసాంజనేయస్వామి దేవస్థానంలో సుందరాకాండ సప్తాహం గురువారం ప్రారంభమైంది. స్థానాచార్యులు ఎస్‌సీహెచ్ విఠలాచార్యులు ఆధ్వర్యంలో ఏడు రోజుల పాటు సుందరాకాండ సప్తాహం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. సర్వకార్య సిద్ధికి, అనారోగ్యం నుంచి విముక్తికి సుందరాకాండ చదవడం, వినడం ఎంతో శ్రేయస్కరమని విఠలాచార్యులు చెప్పారు.

**నూజివీడు డివిజన్‌లో 331.8 మి.మీ వర్షపాతం నమోదు**

**నూజివీడు:** బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి వల్ల నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలో బుధవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు భారీ వర్షం కురిసింది. 331.8 మి.మీ వర్షపాతం నమోదైంది.అత్యధికంగా ముసునూరు మండలంలో నమోదు కాగా, నూజివీడు మండలంలో తక్కువగా నమోదైంది.









## నీట మునిగిన వరి పొలాలు



ఓబులాపురం గ్రామ శివారులో మునిగిన వరి పొలాలు



రెడ్డిగూడెం మండలంలో వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఆర్డీఓ మాధురి

**ఓబులాపురం(జి.కొండూరు):** రెడ్డిగూడెం మండలం ఓబులాపురం గ్రామం వద్ద కళంగవాగు పొంగి పొర్లింది. ఎ.కొండూరు మండలంలోని కొండ ప్రాంతాల నుంచి వచ్చే ఈ వాగు వరద ప్రవాహానికి ఓబులాపురం నాగసానిపాటి చెరువు కింద సాగువుతున్న వరిపైరు రెండు వందల ఎకరాల వరకు నీట మునిగింది. వరద ప్రవాహం రహదారిపైకి చేరడంతో ఓబులాపురం, రెడ్డిగూడెం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్దార్ సుశీలాదేవితో కలిసి తిరువూరు ఆర్డీఓ కె.మాధురి వరద ప్రవాహాన్ని పర్యవేక్షించారు. ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు చేపట్టాలని స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారులకు సూచించారు. అనంతరం రెడ్డిగూడెం కోతులవాగు, రంగాపురం గ్రామంలోని పెద్ద చెరువు, మొద్దులపర్వ గ్రామంలోని అలుగు వాగు, నగరుకుళ్లపాడులోని కట్టలేరు వాగులను పరిశీలించారు.

**విస్సన్నపేట:** తిరువూరు ఆర్డీఓ మాధురి విస్సన్నపేటలో రేగటి వాగు, పుట్రేలలో గాజుల చెరువు అలుగులను గురువారం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. తహసీల్దార్ కె. లక్ష్మీకల్యాణి, ఇన్‌చార్జీ ఎంపీడీఓ ప్రసాద్ పాల్గొన్నారు.

**వాగుల వద్ద రాకపోకల నియంత్రణ**

**తిరువూరు:** మండలంలోని చౌటపల్లి వద్ద గుర్రపు వాగు, పడమటివాగు, గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టలేరు వాగులలో వరద ప్రవాహం పెరుగుతుండటంతో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం అప్రమత్తమై వాహనాల రాకపోకలను నియంత్రిస్తున్నారు. తిరువూరు ఆర్డీఓ కె. మాధురి రెడ్డిగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు తిరువూరు, గంపలగూడెం మండలాల్లో వరదల పరిస్థితిని తహసీల్దార్లతో సమీక్షించారు.

## చెరువు కట్టల బలోపేతానికి చర్యలు



**నూజివీడు:** చెరువుల వద్ద కట్టలు పటిష్టంగా ఉండేందుకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టామని సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న అన్నారు. బుధవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు భారీ వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో మొగల్ చెరువు, పెద్ద చెరువు, గొడుగువారిగూడెం, ఆర్‌ఆర్ పేట, ఎంప్లాయిస్ కాలనీ, తిరువూరు బస్టాండ్ రోడ్డు, బైపాస్ రోడ్డు ప్రాంతాల్లో ఆమె పర్యటించి స్థానికులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ ఆర్. వెంకటరామిరెడ్డి, ఇరిగేషన్ డీఈ అర్జునరావు, అధికారులు పాల్గొన్నారు.








